
సాక్షి
బాపట్ల

మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 5527 క్యూసెక్కులు విడుదల చేశారు.



15న వైద్యకళాశాల ప్రారంభం

మచిలీపట్నం: బందరులోని వైద్య కళాశాలను ఈ నెల 15న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నట్లు కృష్ణా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు.

18 ఆదిశంకరాచార్యుల విగ్రహావిష్కరణ

సత్తెనపల్లి: మధ్యప్రదేశ్ ఓంకారేశ్వరంలో ఈనెల 18న జరగనున్న జగద్గురు ఆదిశంకరాచార్యుల విగ్రహావిష్కరణకు హాజరు కావాలని సత్తెనపల్లి త్రిశక్తి దుర్గా పీఠం అధిపతి వెలిదండ్ల హనుమత్ స్వామిజీకి ఆహ్వానం అందింది.



టీడీపీ బంద్ విఫలం

- స్పందించని తెలుగు తమ్ముళ్లు
- గొట్టిపాటి మినహా కానరాని ముఖ్యనేతలు
- యథావిధిగా జనజీవనం



కర్లపాలెంలో యథావిధిగా సాధారణ జనజీవనం

సాక్షి ప్రతినిధి,బాపట్ల: చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా సోమవారం టీడీపీ చేపట్టిన బంద్ విఫలమైంది. జనజీవనం యథావిధిగా సాగింది. దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు తెరుచుకున్నాయి. ఆర్టీసీ బస్సులు తిరిగాయి. తెలుగుతమ్ముళ్లు ఎక్కడా బయటకు రాలేదు. టీడీపీ ముఖ్యనేతలూ కానరాలేదు.

- అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఒక్కరే బంద్‌లో పాల్గొన్నారు. సోమవారం ఉదయం అద్దంకికి వచ్చిన ఆయన స్థానిక బంగ్లారోడ్డులో కొద్దిసేపు రోడ్డుమీద బైఠాయించారు. అనంతరం పోలీసులు ఆయనను స్టేషన్‌కు తరలించి కొద్దిసేపటికే వదిలిపెట్టారు. ఆ తరువాత గొట్టిపాటి నియోజకవర్గం నుంచి వెళ్లిపోయారు. అద్దంకిలో ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరిగాయి. దుకాణాలు తెరిచారు.
- పర్చూరులో బంద్ ప్రభావం లేదు. ఇక్కడ టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఏలూరి సాంబశివరావు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన నియోజకవర్గానికి రాలేదు. బంద్‌లో పాల్గొనలేదు. దీంతో పార్టీ శ్రేణులూ బయటకు రాలేదు.
- చీరాల నియోజకవర్గంలోనూ బంద్ ప్రభావం ఏమాత్రం కనిపించలేదు. పార్టీ ఇన్‌చార్జ్ ఎం.ఎం.కొండయ్య కానరాలేదు.
- టీడీపీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేంద్ర వర్మ హైదరాబాద్‌కే పరిమితమయ్యారు. పార్టీ కార్యకర్తలెవరూ రోడ్లపైకి రాలేదు.
- రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ కూడా కానరాలేదు. కొందరు కార్యకర్తలు మొక్కుబడిగా రోడ్లపై కొద్దిసేపు నిరసన వ్యక్తం చేసి మిన్నకున్నారు.
- వేమూరు నియోజకవర్గంలో కొందరు కార్యకర్తలు కొన్ని దుకాణాలు మూయించారు. ఆ తర్వాత యథావిధిగా వ్యాపార సముదాయాలు తెరుచుకున్నాయి. బస్సులు యథావిధిగా తిరిగాయి.

చంద్రబాబు గజదొంగ

- అందుకే జైలు ఊచలు లెక్కిస్తున్నారు
- యువతకు శిక్షణ పేరుతో రూ.371 కోట్లు దోచేశారు
- బాబు అరెస్టుతో స్వర్గంలో ఉన్న ఆత్మలు శాంతిస్తున్నాయి
- కక్షసాధింపు కాదు కాబట్టే అరెస్టుకు ఇంత కాలం పట్టింది
- పవన్ కళ్యాణ్ చిల్లర చేష్టలు మానుకోవాలి
- ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత ధ్వజం



ఒంగోలు: గజదొంగ చంద్రబాబు అవినీతి, అక్రమాలకు పాల్పడడంలో స్కిల్డ్ అని, యువతకు శిక్షణ పేరుతో రూ.371 కోట్లు కొల్లగొట్టి నేడు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఊచలు లెక్కబెడుతున్నారని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు విజనరీ అన్నారు. 2014–19 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కనీసం జీఓ కాని, క్యాబినెట్ అప్రూవల్ కానీ లేకుండా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. వ్యవస్థలను మేనేజ్ చేయడం, స్టేలు తెచ్చుకుంటూ చట్టం నుంచి తప్పించుకోవడం బాబుకు అలవాటుగా మారిందని, కానీ నేడు తొలిసారిగా ఆయనకు దేవుడు శిక్ష విధించాడన్నారు. స్వర్గంలో ఉన్న ఎన్టీఆర్ ఆత్మ రాసిన స్క్రిప్ట్‌గా దీనిని భావిస్తున్నామన్నారు. 74 ఏళ్ల వయస్సులో రామారావును ఎలాంటి మానసిక క్షోభ పెట్టారో నేడు అదే వయస్సులో చంద్రబాబు జైలు ఊచలు లెక్కబెడుతూ ప్రజాగ్రహానికి గురయ్యారన్నారు. మరో వైపు చంద్రబాబు కొడుకు లోకేష్, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌లు, పచ్చపత్రికలు జగనన్నపై ఏడుపులు, దుర్మార్గపు రాతలు రాస్తూ కక్ష కట్టారనడం అవివేకం అన్నారు. రాజకీయ కక్షే అయి ఉంటే ఏనాడో చంద్రబాబు జైలు పాలయ్యేవారని, చట్టం తన పని తాను చేసుకుపోతోంది కాబట్టే ఇప్పటికి పాపం పండిందన్నారు. చంద్రబాబుకు 23 అంటే కలిసి రావడంలేదని, చివరకు చంద్రబాబుకు వచ్చిన ఖైదీ నంబర్ 7691లోని అంకెల మొత్తం కూడా 23 రావడం గమనించాలన్నారు. చంద్రబాబు ఇప్పటి వరకు తాను సత్యహరిశ్చంద్రునికన్నా గొప్పవాడినని, పెద్ద నిప్పు అని చెప్పుకుంటుండేవారన్నారు. కానీ నేడు ఆయన ఎంతటి సత్యహరిశ్చంద్రుడో రాష్ట్రంలో ఆయనను అరెస్టుచేస్తే సంబరాలు చేసుకుంటున్న జనాన్ని చూస్తే అర్థం అవుతోందన్నారు. కనీసం పార్టీ నాయకులు కూడా రోడ్డుమీదకు రావడానికి వెనుకాడారు అని, అందుకు సాక్ష్యం అచ్చెన్నాయుడు ఆడియోనే నిదర్శనమని సునీత ఎద్దేవా చేశారు. మరో వైపు పవన్ కళ్యాణ్ ఇదేదో సినీ సెట్టింగ్ అన్నట్లుగా రోడ్డుమీద కాలు మీద కాలు వేసుకుని పడుకోవడం ఆయన రాజకీయ అపరిపక్వతకు నిదర్శనమని పోతుల సునీత విమర్శించారు. రాజకీయాల్లో పరిపక్వత ఉండాలి తప్ప చిల్లర రాజకీయాలు ఉండరాదని తెలుసుకోవాలన్నారు. నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపి బాబు శునకానందం పొందారని, నాడు జగన్ తల్లి, చెల్లి, భార్య, బిడ్డలు ఎంతగా విలవిల్లాడారో గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఖర్మ ఫలం అనుభవించక తప్పదని, మనం ఏమి చేస్తామో భగవంతుడు కూడా మనకు అదే ఇస్తాడనేందుకు ఇదే నిదర్శనం అన్నారు. కేవలం ప్రచారం కోసం గోదావరి పుష్కరాలలో 23 మందిని బాబు పొట్టనబెట్టుకున్నారని, ఇటువంటి అనేక ఘటనలలో అశువులు బాసిన వారి ఆత్మలన్నీ నేడు రాజమండ్రి సెంట్రల్ జైలులో చంద్రబాబును చూసి సంతృప్తి చెందుతున్నాయని ఎమ్మెల్సీ పోతుల సునీత పేర్కొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి

కలెక్టర్ పి.రంజిత్‌బాషా



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: సీజనల్, అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో కలెక్టర్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు ప్రారంభించాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు పరిశీలించి ప్రతి రోజూ నివేదికలు ఇవ్వాలన్నారు. మురుగునీటి కాలువలు శుభ్రం చేయాలన్నారు. తాగునీటి ట్యాంకులు క్లోరినేషన్ చేయాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. డీపీఓ ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రతి బుధ, శుక్రవారాల్లో గ్రామాలను సందర్శించాలన్నారు. జిల్లాలో స్పందన అర్జీలు, రీఓపెన్ అర్జీలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్పందన రీ ఓపెన్ అర్జీలు పంచాయతీ, విద్యుత్ శాఖల్లో ఎక్కువగా ఉన్నాయని అన్నారు. జగనన్నకు చెబుదాం అర్జీలు వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ.వి.ఎస్.ఎన్.మూర్తి, సీపీఓ భరత్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్,జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, మత్స్య శాఖ జేడీ సురేష్, డీఎస్ఓ విలియమ్స్, డీఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే సహించేది లేదు

- బలవంతంగా దుకాణాలు మూయిస్తే కఠిన చర్యలు
- జిల్లాలో కట్టుదిట్ట భద్రతా చర్యలు
- ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరిక



చీరాల రైల్వేస్టేషన్ వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్/చీరాల: జిల్లాలో ఎక్కడైనా ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే సహించేది లేదని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. టీడీపీ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం బందోబస్తులో భాగంగా ఆయన బాపట్ల, చీరాల రైల్వేస్టేషన్లను పరిశీలించారు. తొలుత పోలీస్ అధికారులకు పలు భద్రత పరమైన సూచనలు చేశారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా 30 ఏపీ పోలీస్ యాక్టు, 144 సెక్షన్ అమలులో ఉందని, సాధారణ జన జీవనానికి, రాకపోకలకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నిరసనలకు, ధర్నాలకు అనుమతి లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 800 మంది పోలీసు సిబ్బంది బందోబస్తును పర్యవేక్షిస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ ఎ.శ్రీనివాస్, బాపట్ల పట్టణ సీఐ యు.శ్రీనివాసులు, చీరాల టూటౌన్ సీఐ జి.సోమశేఖర్ పాల్గొన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం ..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

సరస్వతి స్మారక గవర్నమెంట్ బాలికల ఉన్నత పాఠశాల, సూర్యలంక రోడ్, పాతకోర్టు ఎదుట, బాపట్ల

తేది : 16-09-2023 (శనివారం)

సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.

రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 97030 13015

District sponsor

VIVA THE SCHOOL BY VVIT

ఆదర్శ, అంతర్జాతీయ విద్యకు ఏపీ నిలయం

- మనోధైర్యాన్నిచ్చే విజ్ఞానాన్ని అందించడమే సీఎం జగన్ లక్ష్యం
- సాంకేతికత, నైపుణ్యంతో కూడిన విద్యను ప్రభుత్వం అందిస్తోంది
- రానున్న ఐదేళ్లలో ఈ సంస్కరణల ఫలితాలు కనిపిస్తాయి
- ప్రభుత్వం అందిస్తున్న వసతులు సద్వినియోగం చేసుకోండి
- ఏఎన్‌యూ వ్యవస్థాపక దినోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



ప్రభుత్వ సేవా రంగంలో విశిష్ట కృషి చేసిన కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి ప్రతిభా పురస్కారం ప్రదానం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి. ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ(గుంటూరు): ఆదర్శవంత, అంతర్జాతీయ విద్యకు ఆంధ్రప్రదేశ్ నిలయంగా మారిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సోమవారం జరిగిన యూనివర్సిటీ 46, 47వ వ్యవస్థాపక దినోత్సవంలో సజ్జల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ యువతకు సంపూర్ణ మనోధైర్యాన్నిచ్చే విద్యను అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చేపడుతున్నారన్నారు. ప్రపంచ విద్యారంగంలో ఏపీకి ప్రత్యేక చోటు దక్కుతోందన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికత, ఉపాధికి దోహదం చేసే నైపుణ్య లక్షణాలతో కూడిన పరిపూర్ణ విద్యను ఏపీలో అన్నివర్గాలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎంకే దక్కుతోందన్నారు. జాతీయ విద్యా విధానంలోని అంశాలన్నీ అమలు చేస్తూ విద్యార్థుల పరిపూర్ణ భవిష్యత్ రూపకల్పన ఒక్క ఏపీలోనే జరుగుతోందన్నారు. కేజీ నుంచి పీజీ వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అన్ని వర్గాలకు చేరువ చేయడం జరిగిందన్నారు. డిజిటల్ లైబ్రరీలు, టెక్నాలజీ వినియోగంతోపాటు పలు ఆధునిక అంశాలు విద్యార్థులకు చేరువయ్యాయని, వాటి ఫలితాలు రానున్న ఐదేళ్లలో కనిపిస్తాయన్నారు. ఉన్నత ఆశయంతో ఏపీ ప్రభుత్వం అందిస్తోన్న వసతులు, విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని దేశ, రాష్ట్ర భవిష్యత్ నిర్ణయించే ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. ప్రస్తుతం అవకాశాలు అనంతంగా ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకునే నైపుణ్యాన్ని యువత పెంపొందించుకోవాలని సూచించారు. సమాజంలో పలు రంగాలలో ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు ఏఎన్‌యూ పురస్కారాలు ప్రదానం చేయడం హర్షణీయమన్నారు. ఆయా రంగాలలో ప్రతిభ కనబరిచిన వారికి సమాజాన్ని ప్రభావితం చేసే శక్తి ఉంటుందన్నారు. సమాజానికి ఉపయోగపడే సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దేశంలోనే ఏఎన్‌యూ ప్రత్యేకతను సొంతం చేసుకుంటుందన్నారు. పలు రంగాలలో ప్రతిభ కనబరిచిన 22 మందికి ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్, మాజీ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్, రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, వ్యవస్థాపక దినోత్సవ కో–ఆర్డినేటర్ ఆచార్య కె. మధుబాబు, పలువురు అధికారులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- వైద్యసేవ పురస్కార గ్రహీత, న్యూరో సర్జన్ డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తన తండ్రి ఏఎన్‌యూ ఉద్యోగి అని, వర్సిటీకి చాలా రుణపడి ఉన్నానన్నారు.
- మరో వైద్యసేవ పురస్కార గ్రహీత గుంటూరు వైద్య కళాశాల అధ్యాపకురాలు ఆచార్య వల్లమూడి విజేత మాట్లాడుతూ వైద్యరంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు.
- జానపద పురస్కార గ్రహీత తెలంగాణ జానపద కళాకారుడు జయరాజ్ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తే నేడు ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీలో ఇంగ్లిష్ మీడియం బోధన ప్రవేశ పెట్టడంతోపాటు అనేక విప్లవాత్మక సంస్కరణలు అమలు చేస్తున్నారన్నారు.

వీరితోపాటు జయప్రద రామమూర్తి(శాస్త్రీయ సంగీతం), గద్దె మంగయ్య (విద్య, దాతృత్వ రంగం), దాసరి రామకృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ), డాక్టర్ మాకినేని కిరణ్(వైద్య, సేవా రంగం), ఎన్ హనుమంతరావు(కళారంగం), మాస్టార్జీ (సామాజిక కళా సేవా రంగం), డాక్టర్ కోయి కోటేశ్వరరావు(సాహిత్య రంగం), ఆశిరయ్య (జానపద కళారంగం), సిస్టర్ రోసలీన(సేవా రంగం), మల్లాది సూరిబాబు (శాస్త్రీయ సంగీత రంగం), ఆర్ గోపాలకృష్ణ(విద్యా రంగం) తరుపున గుంటూరు ఆర్‌వీఆర్ అండ్ జేసీ కాలేజ్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, డాక్టర్ గీతా రెడ్డి (మహిళా సాధికారిత రంగం), శారదా శృంగేరి (లిటరేచర్ అండ్ సేవా రంగం), డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ(పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ రంగం), డాక్టర్ ఎస్ఎస్‌వి రమణ(ప్రజా వైద్య రంగం), సయ్యద్ మౌలాలి(గ్రామీణ పారిశ్రామిక రంగం), దర్శనం మొగలయ్య (కళా రంగం) ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. మొగలయ్య, ఆశిరయ్య జయరాజ్ గీతాలు పాడి తమ కళను ప్రదర్శించారు. ప్రభుత్వ సేవా రంగంలో పురస్కారం అందుకోవాల్సిన ఐఏఎస్ అధికారి గిరిజాశంకర్ త్రిపురలో ఉండటం వల్ల కార్యక్రమానికి రాలేకపోయారు. అలాగే యూనివర్సిటీలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉతమ పరిశోధనా పత్రాలు సమర్పించిన వారికి, ఉత్తమ పేటెంట్‌లు పొందిన వారికి అవార్డుల ప్రదానం జరిగింది.

ఏఎన్‌యూ పురస్కారం పూర్వజన్మ సుకృతం

పురస్కార గ్రహీత, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

ఏఎన్‌యూ(గుంటూరు) : సేవలను గుర్తించి పురస్కారాన్ని ప్రదానం చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చేతులమీదుగా ప్రతిభా పురస్కారాన్ని అందుకున్న కలెక్టర్ మాట్లాడుతూ ఈ పురస్కారం తన పూర్వజన్మ సుకృతంగా, ఏఎన్‌యూ నుంచి దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తానని పేర్కొన్నారు. పురస్కారాలు మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. 2007 నుంచి అనేక హోదాల్లో పని చేసిన తనకు 2022లో చైతన్యవంతమైన గుంటూరు జిల్లాకు కలెక్టర్‌గా సేవలందించే మహత్తర అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు.

ప్రతిభావంతులను సన్మానించడం గర్వంగా ఉంది

సభలో వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ప్రసంగిస్తూ సమాజంలోని వివిధ రంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన వారిని యూనివర్సిటీ పురస్కారంతో సన్మానించడం గర్వంగా ఉందన్నారు. వీరిలో అత్యధికులు అట్టడుగు స్థాయి నుంచి తమ ప్రతిభతో అత్యున్నత స్థాయికి ఎదిగినవారేనన్నారు. ఏఎన్‌యూ ప్రగతి గురించి వివరించారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, వ్యవస్థాపక దినోత్సవం కో–ఆర్డినేటర్ ఆచార్య కె.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు కూడా దరఖాస్తులు స్వీకరణ

గుంటూరు మెడికల్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకున్నవారికి తొలుత సోమవారం వరకు గడువు ఇచ్చామని డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. జిల్లాలో కొన్ని చోట్ల బంద్ కారణంగా దరఖాస్తులు సమర్పించేందుకు అభ్యర్థులు ఇబ్బంది పడినట్లు తమ దృష్టికి రావడంతో మంగళవారం సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎల్‌జీఎస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వెల్లడించారు.

20న సైన్స్ సదస్సు

నరసరావుపేట ఈస్ట్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో చిరుధాన్యాలపై జిల్లాస్థాయి సైన్స్ సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. చిరుధాన్యాలు మంచి పౌష్టికాహారమా లేక ఆహార వ్యామోహమా అనే అంశంపై 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఈ సదస్సు ఏర్పాటు చేసినట్టు వివరించారు. అన్ని యాజమాన్యాలలో పనిచేసే పాఠశాలల విద్యార్థులు పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు పాల్గొనవచ్చని స్పష్టం చేశారు. 8 నిమిషాల కాలవ్యవధిలో 6 నిమిషాలలో విద్యార్థులు తమ ప్రాజెక్ట్‌ను న్యాయనిర్ణేతలకు తెలియచేయాలనీ, మిగిలిన రెండు నిమిషాలు న్యాయనిర్ణేతలు విద్యార్థులను ప్రశ్నించి సమాధానాలు రాబడతారని తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఏ.ఏ. మధుకుమార్ 90328 71234ను సంప్రదించాలని కోరారు.

యార్డుకు 24,716 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 24,716 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 23,897 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.12,500 నుంచి 24,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,478 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.


22న ఎస్‌ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

నగరంపాలెం: గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో సోమవారం జరగాల్సిన ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు వర్షం కారణంగా వాయిదా పడినట్లు గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 11న వాయిదా పడిన అభ్యర్థులకు ఈనెల 22న పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పులిచింతలలో నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ క్రమంగా పెరుగుతోంది. సోమవారం సాయంత్రానికి 28 టీఎంసీలకు చేరింది. నదీ పరీవాహక ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలకు గత వారం రోజులలో నీటి నిల్వ సుమారు 7 టీఎంసీలు పెరిగింది. ప్రాజెక్టు సామర్థ్యం 45.77 టీఎంసీలు. ఎగువ నుంచి 8,100 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 524.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 854.70 అడుగుల వద్ద ఉంది.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.6,000, గరిష్ట ధర రూ.8,500, మోడల్ ధర రూ.7,000 వరకు పలికింది.

అడ్డంగా దొరికి ముఖ్యమంత్రిపై ఆరోపణలా?

- చంద్రబాబును సీఎం చేయడం కోసమే పవన్ పోరాటం
- మీడియా సమావేశంలో వెంకటేష్ ధ్వజం


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

చీరాల: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో ఆధారాలతో అడ్డంగా దొరికి చంద్రబాబు నాయుడు జైలు పాలైతే టీడీపీ నేతలు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మాత్రం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్ సీపీపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెంకటేష్ మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో పక్కా ఆధారాలు ఉండబట్టే చంద్రబాబు అరెస్టు అయ్యి జైలు పాలయ్యాడన్నారు. దీనిని సీఎం జగన్‌కు ఆపాదించడం హాస్యాస్పదమన్నారు. కొద్ది నెలల్లో జరిగే ఎన్నికల ముందు ఎవరు కూడా ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెట్టడం జరగదన్నారు. స్వతంత్ర దర్యాప్తు సంస్థ అయిన సీఐడీ పూర్తి ఆధారాలతో కేసు పెడితే న్యాయ వ్యవస్థ చంద్రబాబుకు రిమాండ్ విధించిన సంగతి గుర్తుంచుకోవాలన్నారు. అదే జగన్‌మోహన్‌రెడ్డిని 16 నెలలు అక్రమంగా జైలులో పెడితే అప్పుడు లేవని గొంతులు ప్రస్తుతం లేచి పడుతున్నాయన్నారు. రిమాండ్ ప్రభుత్వం విధించదని కేవలం న్యాయమూర్తులే విధిస్తారని టీడీపీ నేతలు తెలుసుకోవాలని అన్నారు. అసలు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా రాష్ట్రంలో ఎవరికి ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో, ఎటువంటి శిక్షణ అందించిందో లెక్కలు తేల్చాల్సిన బాధ్యత అప్పటి ప్రభుత్వానిదేనన్నారు. అచ్చెన్నాయుడు లాంటి నేతలు టీడీపీ నేరుగా ప్రజలను రెచ్చగొట్టి రాష్ట్రంలో విధ్వంసాలు సృష్టించాలని చేస్తున్న ప్రయత్నాలు వీడియో చిత్రాల ద్వారా బయటపడిన సంగతి ప్రజలకు తెలుసన్నారు. అందుకే చీరాల్లో చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌కు నిరసనగా బంద్ పేలవంగా జరగడమే నిదర్శనమన్నారు.

చంద్రబాబు పీఠం కోసమే పవన్ పాకులాట..

దేశంలో ఏ రాజకీయపార్టీ నాయకుడు వ్యవహరించని విధంగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వ్యవహరిస్తున్నాడన్నారు. 2018లో చంద్రబాబు, నారా లోకేష్‌లు పెద్ద అవినీతి పరులని బహిరంగ సభల్లో విమర్శించిన పవన్‌కళ్యాణ్‌కు చంద్రబాబు ప్రస్తుతానికి దేవుడయ్యాడన్నారు. రాజకీయపార్టీలంటే ఇతర పార్టీల నాయకులకు మద్దతు పలకడం పరిపాటేగానీ పవన్‌కళ్యాణ్ రోడ్ల మీద పడుకుని దొర్లాడుతూ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టి రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. చంద్రబాబును సీఎంగా పీఠం ఎక్కించేందుకు జనసేన క్యాడర్‌తో టీడీపీకి ఊడిగం చేయిస్తున్నారని విమర్శించారు. టీడీపీ, జనసేన రెండు పార్టీలు ఒక్కటేనని, చంద్రబాబును సీఎంగా చేయడం కోసం జనసేన నేత పవన్ పాకులాట పడటాన్ని జనసేన నేతలు గుర్తించుకోవాలని హితవుపలికారు. పవన్ తాటాకు చప్పుళ్లకు, వాళ్ల చేసే కుట్రలకు తగిన రీతిలో బుద్ధి చెబుతామని అన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ జైసన్‌బాబు, కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు మించాల సాంబశివరావు, గొట్టిపాటి ఎబినేజర్, బత్తుల అనీల్, అరుణ్, పార్టీ నాయకులు బాబ్జి, గుంటూరు మాధవరావు, పులి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లాభాల సాగు బొప్పాయి

- బొప్పాయి సాగుపై రైతన్న ఆసక్తి
- జిల్లాలో పెరుగుతున్న సాగు
- ఇతర రాష్ట్రాలకు రవాణా
- ఆనందంలో రైతులు


బొప్పాయి పంట

మేదరమెట్ల: సంప్రదాయ పంటలతో విసిగిన రైతన్న ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. విటమిన్ ఏ సమృద్ధిగా ఉండే పండ్లలో బొప్పాయి ఒకటి. బొప్పాయి వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో మార్కెట్‌లో గిరాకీ ఉన్న బొప్పాయి పంటను సాగు చేసేందుకు బాపట్ల జిల్లాలో రైతులు మొగ్గుచూపుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతికూల పరిస్థితులను అధిగమించి బొప్పాయి పంటను జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తూ లాభాల బాటలో నడుస్తున్నారు బొప్పాయి రైతులు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించి బొప్పాయిని సాగు చేసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చని తద్వారా రైతులకు లాభాలు వస్తాయని ఉద్యానశాఖ అధికారిణి దీప్తి పేర్కొన్నారు.

324 ఎకరాల్లో బొప్పాయి సాగు

జిల్లాలోని కొల్లూరు మండలంలో 9.02, భట్టిప్రోలులో 18.23, సంతమాగులూరులో 155.74, బల్లికురవ 45.54, మార్టూరు 12.85, యద్దనపూడి 11.79, జే.పంగులూరు 21.93, అద్దంకి 32.18, కొరిశపాడు 16.74 ఎకరాల్లో బొప్పాయి సాగు చేస్తున్నారు. రెండు సంవత్సరాల పంటకాలంలో ఎకరాకు 90 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. పెట్టుబడి ఖర్చుపోను నికరంగా రూ.2లక్షల వరకు ఆదాయం రావడంతో జిల్లా రైతులు బొప్పాయి సాగు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అందులో భాగంగానే గతంలో నామమాత్రంగా సాగు చేపట్టిన బొప్పాయి ఈ ఏడాది అత్యధికంగా 324 ఎకరాలకు పైగా సాగు చేపట్టారు. బొప్పాయి సాగులో రైతులు రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టడం వలన పండిన పంట ఆరోగ్యంగా, ఆకర్షణీయంగా కనిపించడంతో ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి కాయలకు ఎక్కువ డిమాండ్ ఉంటుందని రైతులు చెప్తున్నారు.

అనుకూలమైన రకాలతో మంచి దిగుబడి

జిల్లాలో సాగు చేపట్టాలనుకునే రైతులు రెడ్ లేడీ, వాషింగ్‌టన్, కో 1,2,3 రకాలు అనువైనవి. బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకున్న తర్వాత ట్రికోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేసుకోవాలి. మొక్కలు నాటే సమయంలో గుంతల్లో ప్రతి గుంతకూ 20 కిలోల పశువుల ఎరువు, 20 గ్రాముల అజోస్పైరిల్లమ్, 20 గ్రాముల ఫాస్ఫోబాక్టీరియా, 40 గ్రాముల మైకోరైజాను బాగా కలుపుకొని వేసుకోవాలి.

నాటే సమయం

జూన్, జులై, అక్టోబర్, నవంబర్ మాసాల్లో నాటుకోవచ్చు. 40 నుంచి 60 రోజుల వయస్సున్న 15 సెంటీమీటర్ల పొడవు గల మొక్కలను సాయంత్రం సమయంలో నాటుకోవాలి.

ఎరువుల యాజమాన్యం

ప్రతి మొక్కకూ రెండు కిలోల నాడెప్ కంపోస్టు, ఒక కిలో వేపపిండి, అర కిలో ఘనజీవామృతం వేసుకొని మొక్కలను నాటుకోవాలి. తరువాత ప్రతి 20 రోజులకు ఒకసారి ద్రవ జీవామృతాన్ని పారించుకోవాలి. మొక్కలపై ప్రతి 15 రోజులకొకసారి పంచగవ్యను పిచికారీ చేసుకోవాలి. ప్రతి 25 రోజులకు ఒకసారి శొంఠి పాల కషాయాన్ని పిచికారీ చేసుకోవాలి.

యాజమాన్య పద్ధతులు పాటించాలి..



బొప్పాయిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు సాధించవచ్చు. ప్రకృతి సాగు చేయడం వలన కాయలు బరువుగా నాణ్యత కలిగి ఉంటాయి. వేసవిలో కూడా బెట్టకు రాకుండా అధిక దిగుబడులు వస్తాయి. అలాగే పండుగ సమయాల్లో టన్ను రూ.22 వేల వరకు పలుకుతుంది. మార్కెట్‌లో కిలో బొప్పాయి రూ.90 వరకు విక్రయిస్తున్నారు. డిమాండ్ లేని సమయంలో కూడా టన్ను రూ.10 నుంచి 15 వేలు ధర పలుకుతుంది.

– దీప్తి, ఉద్యానశాఖ అధికారిణి

మానవత్వంతో ప్రజా సమస్యల పరిష్కారం

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మానవత్వం చూపాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో సోమవారం జగనన్నకు చెబుదాం (స్పందన) ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు, డీఆర్వో కె.వినాయకంలతో కలిసి ప్రజల నుంచి 52 అర్జీలను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున అర్జీదారులు కలెక్టరేట్ కార్యాలయానికి తరలివచ్చి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలను అందజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పకడ్బందీగా నిర్వహించాలి

- చైల్డ్ హెల్త్ స్టేట్ జాయింట్ డైరక్టర్ డాక్టర్ అర్జునరావు
- అధికారులకు దిశా నిర్దేశం


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ అర్జునరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి

నరసరావుపేట: జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎటువంటి అలసత్వం చూపించకుండా పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చైల్డ్ హెల్త్ విభాగ స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.అర్జున్‌రావు ఆదేశించారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు ప్రణాళిక రచన సందర్భంగా అధికారులతో సమావేశమయ్యారు. డివిజన్ వారీగా ప్రోగ్రాం అధికారులను నియమించి అమలుకు ప్రణాళికను తయారు చేయాలన్నారు. జిల్లాలో 28 మండలాలు, ఎనిమిది మున్సిపాలిటీలలో ప్రోగ్రాం అమలు చేయాలన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి ఆఖరి వరకు జరిగే కార్యక్రమంలో అందరూ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించి వ్యాధిగ్రస్తుల జాబితాను తయారుచేయాల్సి ఉందన్నారు. తదుపరి ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 30 వరకు ప్రతి సచివాలయంలోని హెల్త్ సెంటర్లలో ఇద్దరు వైద్యాధికారులు, స్పెషలిస్ట్ డాక్టర్లయిన గైనకాలజిస్టు, చిన్నపిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్ బృందం పరీక్షించి 14 రకాల పరీక్షలు చేసి 105 రకాల మందులను అందజేస్తారని తెలిపారు. స్పెషాలిటీ వైద్యం అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ కార్యక్రమం కింద జిల్లాలోని స్పెషాలిటీ హాస్పిటళ్లకు తరలిస్తారన్నారు. జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి జిల్లాలోని అందరు అధికారులు సహకరించాలని కోరారు. అదేవిధంగా ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.సునీల స్పెషలిస్ట్ డాక్టర్లను ప్రాంతాలు వారీగా నియమించాల్సిందిగా కోరారు. ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నందున అధికారులు శ్రద్ధతో పనిచేసి, జయప్రదం చేయాలని కోరారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ డి.హనుమకుమార్, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.చంద్రశేఖర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ ఆఫీసర్ డాక్టర్ కె.పద్మావతి, జిల్లా ఉప మాస్‌మీడియా అధికారి కె.సాంబశివరావు, జిల్లా మలేరియా అధికారి కె. రవి రత్నాకర్‌రావు, లెప్రసీ న్యూక్లియర్ అధికారి పాల్గొన్నారు.

రాష్ట్ర అథ్లెటిక్ సంఘంలో గీత, ప్రసాద్‌లకు చోటు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): రాష్ట్ర అథ్లెటిక్ సంఘంలో జిల్లాకు చెందిన డబుల్ ఒలింపియన్, ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత సత్తె గీత, అథ్లెటిక్ కోచ్ జీవీఎస్ ప్రసాద్‌లకు చోటు దక్కింది. గీతను ఉపాధ్యక్షురాలిగా, ప్రసాద్‌ను సంయుక్త కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ నెల 10న విశాఖలో రాష్ట్ర అథ్లెటిక్ సంఘం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా వీరిద్దరినీ డీఎస్ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్, బీఆర్ స్టేడియం కోచ్‌లు అభినందనలు తెలిపారు.

స్పందన సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ఎస్పీ వకుల్‌జిందాల్


బాధితుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: స్పందన సమస్యలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 27 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలు ఎస్పీకి వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ బాధితుల సమస్యలు క్షుణ్ణంగా తెలుసుకొని సాధ్యమైనంత వరకు సత్వరమే పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులు చేసేందుకు స్టేషన్లకు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. బాధితుల సమస్యలపై ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అలాంటి వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, స్పందన సెల్ సీఐ వి.మాలకొండయ్య పాల్గొన్నారు.

శ్రీ తులసి ట్రస్ట్‌కు 'ఐకాన్ ఆఫ్ ది ఇయర్' జాతీయ పురస్కారం


ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న మురళీకృష్ణ

బాపట్లఅర్బన్: సమాజ సేవే ధ్యేయంగా పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థ శ్రీ తులసి ఎడ్యుకేషనల్ గైడెన్స్ అండ్ ట్రస్ట్‌కు అరుదైన పురస్కారం దక్కింది. ఎమినెన్స్ ఇండియా సంస్థ ఆధ్వర్యాన గోవాలో జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో పలు స్వచ్ఛంద సంస్థలకు పురస్కారాలు అందించారు. కోవిడ్ సమయంలోనే కాక వివిధ సందర్భాలలో సమాజానికి సేవ చేసిన ప్రముఖులకు, ట్రస్టు నిర్వాహకులను సత్కరించారు. ఆంధ్ర రాష్ట్రం నుంచి బాపట్ల జిల్లా పర్చూరు మండలానికి చెందిన శ్రీ తులసి ఎడ్యుకేషనల్ గైడెన్స్ అండ్ ట్రస్ట్ చైర్మన్ కర్పూరపు మురళీకృష్ణకు 2023 సంవత్సరానికిగాను 'ఐకాన్ ఆఫ్ ది ఇయర్' పేరిట అవార్డు బహుకరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గోవా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దిగంబర్ కామత్, యూరో ఏషియన్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సెలర్ సెబాస్టియన్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హర్యానా సభ్యులు ప్రొఫెసర్ కోహడ్ చేతుల మీదగా మురళీకృష్ణకు జాతీయ పురస్కారాన్ని అందజేశారు. జిల్లా వాసికి జాతీయ పురస్కారం రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ పురస్కారం మరింత బాధ్యత పెంచిందని రాబోయే రోజుల్లో అందరి సహకారంతో ట్రస్ట్ సేవలను మరింత విస్తృతం చేస్తామని, తనకు అవార్డు రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ట్రస్ట్ చైర్మన్ మురళీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

అండర్–16 బాలుర ఫుట్‌బాల్ విజేత బాపట్ల

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

చీరాలరూరల్: జిల్లా ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. నల్లమల జోనల్ లెవల్ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్స్ అండర్–16 బాలుర ఫుట్‌బాల్ లీగ్ చాంపియన్ షిప్–2023 పోటీలు ఆదివారం గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా ఫుట్‌బాల్ జట్టు అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కో ఆర్డినేటర్ నూతలపాటి దేవదాసు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న క్రీడా జట్లన్నింటిని వెనుకంజలో నిలిపి మెరుగైన ప్రతిభతో విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన బాపట్ల జిల్లా జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు ఫుట్‌బాల్ క్యాంప్ ఇన్‌చార్జ్ బొనిగల ప్రేమయ్య, జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు దేవదానం, కోచ్ యు. ప్రసన్న, జిల్లా కో ఆర్డినేటర్ నూతలపాటి దేవదాసు, జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, అసోసియేషన్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు, అభినందనలు తెలిపారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక


యోగా పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులతో పీఈటీ ప్రతిమ

జే.పంగులూరు: జాతీయస్థాయి యోగా పోటీలకు చందలూరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ కే ప్రతిమ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 9,10 తేదీల్లో కర్నూలులో 48వ రాష్ట్రస్థాయి యోగా పోటీలు జరిగాయి. ఈ పోటీలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి 10 నుంచి 12 సంవత్సరాల కేటగిరిలో చందలూరు పాఠశాలకు చెందిన ఎస్ శృతి రాష్ట్రస్థాయిలో రెండో స్థానం సాధించి, జాతీస్థాయి యోగా పోటీలకు అర్హత సాధించింది. నవంబర్ 22 నుంచి 26 వరకు అసోం రాష్ట్రంలోని గౌహతిలో జరగనున్న పోటీల్లో క్రీడాకారిణి పాల్గొనున్నట్లు తెలిపారు. 12 నుంచి 14 ఏళ్ల కేటగిరిలో ఎస్ హాసిని రాష్ట్రస్థాయిలో 5వ స్థానం సాధించినట్లు తెలిపారు. క్రీడాకారులను హెచ్ఎం, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఖాసీంకు జ్యోతిష్య జ్ఞానరత్న అవార్డు


తిరుపతిలో అవార్డు అందుకుంటున్న ఖాసిం సాహెబ్

పర్చూరు (చినగంజాం): మండలంలోని ఉప్పుటూరు గ్రామానికి చెందిన ప్రముఖ జ్యోతిష్య, సంఖ్యాశాస్త్ర, సైంటిఫిక్ వాస్తు నిపుణుడు షేక్ అహ్మద్ ఖాసీం సాహెబ్‌కు అంతర్జాతీయ జ్యోతిష్య జ్ఞానరత్న అవార్డు లభించింది. 23 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో చేసిన వాస్తు సేవలకు గుర్తుగా ఈ అవార్డుని ప్రదానం చేసినట్లు సోమవారం ఆయన తెలిపారు. ఆదివారం తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ జ్యోతిష్య ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ అనంతశర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు ఆయన వివరించారు. ఖాసీం సాహెబ్‌కు అవార్డు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ హరిహరన్, డాక్టర్ కే పద్మ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ శ్లాబ్ పెచ్చులు పడి బాలుడికి గాయాలు


వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాలుడు


ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో కిందపడిన శ్లాబ్ పెచ్చులు

చీరాలఅర్బన్: ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బస్సు కోసం ఎదురు చూస్తున్న బాలుడిపై శ్లాబ్ పెచ్చులు ఊడిపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చీరాల బస్టాండ్‌లో సోమవారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. కుంకలమర్రుకు చెందిన మున్నా కుటుంబ సభ్యులతో చీరాల వచ్చి తిరుగు ప్రయాణంలో బస్సు ఎక్కేందుకు బస్టాండ్ ఆవరణలో ప్లాట్‌ఫారంపై వేచిఉన్నాడు. అదే సమయంలో శ్లాబ్ పిట్టగోడ పెచ్చులు ఒక్కసారిగా ఊడిపడిపోవడంతో కింద ఉన్న బాలుడి తలపై పడి తీవ్ర రక్తగాయమైంది. దీంతో స్థానికులు బాలుడిని హుటాహుటిన చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అదే సమయంలో అక్కడ ప్రయాణికులెవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. గతంలోనూ ఇదే విధంగా బస్సుపై శ్లాబ్ పెచ్చులు పడడంతో బస్సుకు ప్రమాదం తప్పింది.

జాతీయస్థాయి పద్యనాటక పోటీల విజేతలు వీరే..

విజయవాడ కల్చరల్: శ్రీదేవి కళా నాట్యమండలి, గుమ్మడి జయరాజ్ కళాపీఠం, సాయి హృదయ నాట్యమండలి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన సత్యహరిశ్చంద్ర నాటక పద్యగాన పోటీల విజేతలను నిర్వాహక సంఘ సభ్యులు గుమ్మడి జయరాజ్, అవినాష్ గుమ్మడి, అరుగు త్రినాథనాయుడు సోమవారం ఒక ప్రకటనలో ప్రకటించారు. గుంటూరుకు చెందిన తేళ్ల రామారావు ప్రథమ బహుమతి, ఎన్టీఆర్ జిల్లాలోని చందర్లపాడుకు చెందిన కస్తాల దుర్గారావుకు ద్వితీయ, పల్నాడు జిల్లా అచ్చంపేటకు చెందిన నీలం దుర్గారావు తృతీయ బహుమతి పొందారు. దొడ్డా మిషాక్ రాజు(కృష్ణా), కె.ఇజ్రాయిల్(బాపట్ల), ముత్యాల నాగేశ్వరరావు(కృష్ణా), మరియదాసు(గుంటూరు), వి.వి.శివారెడ్డి(గుంటూరు)కి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వి.నారాయణ (మహబూబ్‌నగర్), పాణ్యం దత్తాశర్మ(హైదరాబాద్)కు ప్రత్యేక బహుమతులను ప్రకటించి నగదు బహుమతిని అందజేశారు.

20 నుంచి కంప్యూటర్ ట్యాలీలో ఉచిత శిక్షణ

కొరిటిపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి కంప్యూటర్ ట్యాలీ, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జి.బి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ 30 రోజులు ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన సదుపాయంతోపాటు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. 19 నుంచి 44 సంవత్సరాల లోపు ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు కొత్తపేటలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయంలో తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కంప్యూటర్ ట్యాలీ కోర్సుకు 10వ తరగతి మార్కుల జాబితా కాపీ (పాస్ లేదా ఫెయిల్) జతపర్చాలన్నారు. ఈ అవకాశాన్ని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత మహిళలు, నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, 0863–2336912, 8125397953, 9700687696, 9949930155 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

కోర్టు ప్రాంగణంలో మామపై అల్లుడి దాడి

గుంటూరుఈస్ట్: జిల్లా కోర్టు ప్రాంగణంలో అల్లుడు మామపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. నగరంపాలెం ఎస్‌హెచ్‌ఓ హైమారావు కథనం ప్రకారం మేడికొండూరు మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన దారా శ్రీను ఆర్మీ జవాన్‌గా పనిచేస్తున్నాడు. సెలవులపై ఇంటికి వచ్చాడు. భార్య వెంకటలక్ష్మిలు మనస్పర్థలతో విడిపోయారు. కోర్టులో విడాకులకు సంబంధించి కేసు నడుస్తోంది. వాయిదాలకు హాజరయ్యేందుకు దారా శ్రీను, అతని బంధువులు, వెంకటలక్ష్మి, బంధువులు సోమవారం కోర్టుకు వచ్చారు. కోర్టు ప్రాంగణంలో పరస్పరం ఇరువర్గాలు ఎదురుపడి మాటామాటా అనుకోవడంతో వివాదం పెద్దదైంది. దీంతో అల్లుడు శ్రీను మామ శ్రీనివాసరావుపై దాడిచేశాడు.